సాక్షి నారాయణపేట

బుధవారం ♦ 21 ♦ ఆగస్టు ♦ 2024



ఆర్టీసీకి రాఖీ 'పండగ'

మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌కు రికార్డుస్థాయిలో ఆదాయం వచ్చింది.

వివరాలు 8లో ▸



కేంద్ర బృందం సందర్శన

ప్రొ.మహాలక్ష్మి ఆధ్వర్యంలో కేంద్ర బృందం అలంపూర్ ఆలయాలను సందర్శించింది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.0 /21.8

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణపేట రూరల్/కోస్గి: జిల్లాలో ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు గాను బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం లక్ష్మీసుధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట, కోస్గి ఆర్టీసీ బస్సు డిపోల పరిధిలోని ప్రయాణికులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 73828 26293 నంబర్‌ను సంప్రదించి, సమస్యలతో పాటు సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

అలసందలు క్వింటాల్ రూ. 7,521

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం అలసందలు క్వింటాల్ గరిష్టంగా రూ. 7,601, కనిష్టంగా రూ. 7,521 ధర పలికాయి. జొన్నలు గరిష్టంగా రూ. 3,256, కనిష్టంగా రూ. 3 వేలు, పెసర గరిష్టంగా రూ. 7,951, కనిష్టంగా రూ. 4,025 ధరలు వచ్చాయి.

అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ బదిలీ



నారాయణపేట: జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ బదిలీ అయ్యారు. ఆయనకు హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పోస్టింగ్ ఇస్తూ, మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఐదు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. ఎక్కడా ప్రాణ, ఆస్తినష్టం కలగకుండా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైతే పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని అన్నారు. శిథిలావస్థకు చేరిన మట్టి ఇళ్లలో నివాసం ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. నూతనంగా ఏర్పాటుచేసే రెవెన్యూ యాక్ట్‌పై ఈ నెల 23 లేదా 24 తేదీలో జిల్లా స్థాయిలో మేధావులు, సీనియర్ సిటిజన్స్, సీనియర్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, అభిప్రాయాలు సేకరించాలని సూచించారు. ఎల్ఆర్ఎస్, ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా త్వరగా పరిష్కరించాలని తెలిపారు. అవసరమైతే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. వీసీలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ మధుమోహన్ ఉన్నారు.

సివిల్ సప్లయ్‌లో డీఎంల నియామకం

నారాయణపేట: ఉమ్మడి పాలమూరు జిల్లాలో సివిల్ సప్లయ్ శాఖలో పలువరికి జిల్లా మేనేజర్లుగా పదోన్నతులు కల్పిస్తూ మంగళవారం టీజీఎస్ సీఎస్‌సీఎల్ వీసీ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డీఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నాగర్‌కర్నూల్‌లో అకౌంట్స్ ఏఎంగా విధులు నిర్వర్తిస్తున్న రాజేందర్‌ను ఇన్‌చార్జ్ డీఎంగా నియమించారు. హెడ్ ఆఫీస్‌లో విధులు నిర్వర్తిస్తున్న దీప్తి శ్యామలను మహబూబ్‌నగర్ డీఎంగా, వనపర్తిలో ఏఎం (టీఈసీహెచ్)గా విధులు నిర్వరిస్తున్న సేక్ ఇఫ్రాన్‌ను ఇన్‌చార్జ్ డీఎంగా, గద్వాలలో ఏఎం (అకౌంట్స్)గా విధులు నిర్వర్తిస్తున్న కె.విమలను ఇన్‌చార్జ్ డీఎంగా నియమించారు. అయితే నారాయణపేట డీఎం దేవదాసు స్థానచలనం జరగలేదు.

22న ఉపకరణాల నిర్ధారణ శిబిరం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు డీఈఓ రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని ఆర్వీఎం సమావేశ మందిరంలో ఉదయం 9 గంటలకు శిబిరం ఉంటుందని, భారత కృత్రిమ ఉపకరణాల తయారీ సంస్థ ఆధ్వర్యంలో కొనసాగే శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డు, పాస్ ఫొటోలతో రావాలని సూచించారు.

నూతన ఒరవడి..

మున్సిపాలిటీల్లో వాట్సప్ ద్వారా ఆస్తిపన్ను వసూలు



కోస్గి మున్సిపల్ కార్యాలయం

- ఇకపై సులభంగా ట్యాక్స్ చెల్లించే అవకాశం
- దూర ప్రాంతాల్లో ఉండే వారికి తప్పనున్న తిప్పలు
- ప్రజలకు అవగాహన కల్పిస్తామంటున్న అధికారులు

కోస్గి: ప్రస్తుతం దాదాపుగా అన్ని శాఖల్లో డిజిటల్ చెల్లింపులు కొనసాగుతున్నాయి. అందుకు అనుగుణంగా పురపాలక శాఖ కూడా నూతన విధానాలకు శ్రీకారం చుట్టింది. మరింత సాంకేతికతను వినియోగించుకొని వాట్సప్ ద్వారా ఆస్తిపన్ను చెల్లించే అవకాశం కల్పించింది. నూతన విధానంతో ఆస్తిపన్ను చెల్లింపు ప్రక్రియ మరింత సులభతరం కానుంది. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు ఆస్తిపన్ను చెల్లించాలంటే మున్సిపల్ కార్యాలయానికి వెళ్లడమో.. లేక ఇంటికి వచ్చే బిల్ కలెక్టర్‌కు చెల్లించడమో జరుగుతోంది. ఆన్‌లైన్ విధానం అమల్లోకి తీసుకొచ్చినప్పటికీ.. పన్ను చెల్లింపుదారులు ఇబ్బందులకు గురయ్యేవారు. ఆన్‌లైన్ సేవ కేంద్రాలు, మీ సేవ కేంద్రాల్లో క్యూ కట్టాల్సిన పరిస్థితి ఉండేది. అయితే మరింత సులభంగా పన్ను చెల్లించాలనే లక్ష్యంతో వాట్సప్ విధానం తీసుకొచ్చారు. రాష్ట్రమంతా ఒకే నంబర్ వినియోగించి, వాట్సప్ ద్వారా ఆస్తిపన్ను చెల్లించే అవకాశం కల్పించారు. నూతన విధానంతో మరింత వేగంగా పన్ను చెల్లించే అవకాశం ఉంటుంది. కొత్త విధానాలపై మున్సిపల్ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తే, పుర ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందే అవకాశం ఉంటుంది.

సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్..

పన్ను చెల్లించే క్రమంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటుచేశారు. బాధితులు 040–23120410 నంబర్‌ను సంప్రదిస్తే, ఆయా సమస్యలను పరిష్కరిస్తారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల ప్రజలు ఈ విధానంతో పన్ను చెల్లించే అవకాశం కల్పించారు. నూతన విధానంపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా మెరుగైన సేవలు పొందే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. వాట్సప్ విధానంపై అధికారులు విస్తృత ప్రచారం చేయాలని కోరుతున్నారు. దూర ప్రాంతాల్లో ఉండే ఇంటి యజమానులు సులభంగా తమ ఆస్తిపన్ను చెల్లించే అవకాశం లభించింది.

జిల్లాలో మున్సిపాలిటీల వారీగా వివరాలు..

మున్సిపాలిటీ	భవనాలు	పన్ను లక్ష్యం (రూ.లక్షల్లో)
నారాయణపేట	8854	371.22
కోస్గి	5,846	42.69
మక్తల్	7,323	81.82

నూతన విధానం వినియోగం ఇలా..

స్మార్ట్ ఫోన్‌లో మొదట మున్సిపల్ శాఖ వాట్సప్ నంబర్ (90002 53342)ను సేవ్ చేసుకోవాలి. ఆ తర్వాత వాట్సప్ ద్వారా హాయ్ అని మెసేజ్ పంపిస్తే, రాష్ట్ర పురపాలక శాఖ కార్యాలయం నుంచి సమాచారం వస్తుంది. భాషలను ఎంచుకునే క్రమంలో తెలుగు కోసం 'ఏ' అని టైప్ చేయాలి. అందులో పురపాలక శాఖ అందించే 10 రకాల సేవల వివరాలు ఉంటాయి. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల వివరాలు వస్తాయి. అందులో పన్ను చెల్లింపుదారు మున్సిపాలిటీ పేరుకు ఉన్న క్రమసంఖ్యను ఎంపిక చేసుకొని సందేశం పంపాలి. పన్ను వివరాలు తెలుసుకునేందుకు రెండు ఆప్షన్లు వస్తాయి. మొదట ఆస్తిపన్ను సంఖ్య, రెండోది ఇంటి నంబర్‌లలో ఏదైన ఒకటి ఎంచుకొని నమోదు చేయాలి. వెంటనే పన్ను వివరాలు వస్తాయి. ఇంటి యజమాని, పన్ను బకాయి తదితర వివరాలు సరిచూసుకొని పన్ను చెల్లించేందుకు పేమెంట్ ఆప్షన్ ఎంచుకోవాలి. నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా ఆస్తిపన్ను చెల్లించవచ్చు.

అవగాహన కల్పించాలి..



ఆస్తిపన్ను చెల్లింపునకు అందుబాటులోకి తీసుకొచ్చిన వాట్సప్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. నూతన విధానం సక్రమంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఆస్తిపన్ను చెల్లింపునకు మున్సిపల్ కార్యాలయం, ఆన్‌లైన్ కేంద్రాలకు వెళ్లే బాధ తప్పుతుంది.

– వెంకట్రాములు, కోస్గి

సద్వినియోగం చేసుకోవాలి..



మున్సిపాలిటీల పరిధిలోని నివాసాలు, వ్యాపార సముదాయాలు, ఇతర అన్ని రకాల భవనాలను భువన్ యాప్‌లో నమోదు చేయడం జరిగింది. ఎవరు ఎంత పన్ను చెల్లించాలనే వివరాలు నమోదు చేయగానే ఆన్‌లైన్ ద్వారా తెలుస్తుంది. నూతనంగా అమల్లోకి వచ్చిన వాట్సప్ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. నూతన విధానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

– శశిధర్, మున్సిపల్ కమిషనర్, కోస్గి



సింగారం వాగులో అలుగు పారుతున్న చెక్‌డ్యాం

దంచికొట్టిన వాన

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- చెరువుల్లోకి చేరుతున్న నీరు
- అత్యధికంగా మద్దూర్‌లో 136 మి.మీ. వర్షపాతం నమోదు

నారాయణపేట/మాగనూర్/మద్దూర్: జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. సోమవారం రాత్రి 11 నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు ఏకధాటిగా కురిసిన వర్షంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. సింగారం వాగు ఉధృతంగా ప్రవహించింది. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. భారీ వర్షంతో డ్రెయినేజీలు ఎక్కి పారాయి. రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాల్లోకి వర్షపునీరు వచ్చి చేరాయి. అత్యధికంగా మద్దూరు మండలంలో 136 మి.మీ. వర్షపాతం నమోదు కాగా.. అత్యల్పంగా కృష్ణా మండలంలో 28.8 మి.మీ. వర్షం కురిసింది. దామరగిద్దలో 49.6 మి.మీ. నారాయణపేటలో 82.2 మి.మీ. ఊట్కూర్‌లో 39.2 మి.మీ. మాగనూర్‌లో 80.2 మి.మీ. మక్తల్‌లో 60.6 మి.మీ. నర్వలో 107.2 మి.మీ. మరికల్‌లో 30.2 మి.మీ. ధన్వాడలో 42.4 మి.మీ. కోస్గిలో 37.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈ నెలలో ఇదే భారీ వర్షమని అన్నదాతలు చెప్పారు. కాగా, భారీ వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

- ఉమ్మడి మద్దూరు మండలంలోని చెరువులు, కుంటల్లోకి భారీగా వర్షపునీరు వచ్చి చేరింది. మద్దూరు, భూనీడ్, కొత్తపల్లి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత పెద్ద వర్షం ఇదేనని.. మరో రెండుసార్లు ఇలాగే వర్షం కురిస్తే, చెరువులన్నీ నిండుతాయని రైతులు పేర్కొన్నారు.
- మాగనూర్ మండలంలోని అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వర్కూర్ – మాగనూర్, గజ్జరందొడ్డి – చిట్యాల, నేరడగందొడ్డి – తళంకేరి గ్రామాల మధ్యనున్న వాగులు పారడంతో రాకపోకలను నిలిపివేశారు. వర్కూర్ – మాగనూర్ మధ్యనున్న వాగును ఎవరూ దాటకుండా పోలీసులు ముళ్లకంప వేశారు.



ఓబ్లాపూర్ శివారులో నీటమునిగిన పత్తి పంట



మాగనూర్ శివారులో వరిపంట ఇలా..

ప్రత్యేకాధికారుల నియామకం

నారాయణపేట: పంట రుణమాఫీ ప్రక్రియలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్ సుధాకర్ దిశానిర్దేశంతో మండలాల వారీగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు అధికారులను నియమించారు. ప్రభుత్వం ప్రకటించిన మూడు విడతల్లో రుణమాఫీ వర్తించని రైతులు నేరుగా ప్రత్యేక కౌంటర్లలో వ్యవసాయశాఖ అధికారులను కలిసి, లిఖిత పూర్వకంగా వివరాలను అందజేయాలి. అర్హత ఉన్నా.. రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. వ్యవసాయశాఖ మండల అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ.. బ్యాంకర్లు, పీఏసీఎస్ అధికారుల సమన్వయంతో ముందుకు సాగనున్నారు. రైతు ఫిర్యాదు క్రమంలో క్రాప్‌లోన్ వేవర్స్ పోర్టల్‌లో సంబంధిత పత్రాలను నమోదు చేస్తారు. అనంతరం అర్హులైన వారి జాబితాను వ్యవసాయశాఖ, బ్యాంకర్ల ద్వారా పరిశీలించి, ప్రభుత్వానికి నివేదించనున్నారు.

ప్రత్యేకాధికారి	మండలం	ఫోన్ నంబర్
ఆర్.శరత్‌చంద్రం, ఎంఏఓ	నారాయణపేట	72888 94337
మిథున్ చక్రవర్తి, ఎంఏఓ	మక్తల్	72888 94342
శివకుమార్, ఎంఏఓ	మరికల్	72888 94401
ఎం.హరిత, ఎంఏఓ	దామరగిద్ద	96765 62186
రామకృష్ణ, ఎంఏఓ	కోస్గి	72888 94351
గణేష్‌రెడ్డి, ఎంఏఓ	నర్వ	72888 94346
సుదర్శన్‌గౌడ్, ఎంఏఓ	మాగనూర్	80198 14398
అరవింద్, ఏఓ	ధన్వాడ	63034 15573
శ్రావణ్‌కుమార్, ఏఈఓ	మద్దూర్	63058 28972
నరేందర్, ఏఈఓ	గుండుమాల్	99636 26165
మోహన్‌రెడ్డి, ఏఈఓ	కొత్తపల్లి	63058 21651
చరణ్‌కుమార్, ఏఈఓ	ఊట్కూర్	99894 54013
అభిలాష్, ఏఈఓ	కృష్ణా	85558 22210

కంటి పరీక్షలు చేయించుకోవాలి



విద్యార్థులకు నిర్వహిస్తున్న కంటి పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నానాయక్

నారాయణపేట: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ సిక్తా పటానాయక్ సూచించారు. నారాయణపేట ఉన్నత పాఠశాలలో మంగళవారం కంటి పరీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల దృష్టి లోపాలను గుర్తించేందుకు పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఐదు నుంచి పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ సౌభాగ్యలక్ష్మి, హెచ్ఎం వేణుగోపాల్, డాక్టర్లు సాయిరాం, రాఘవేందర్‌రెడ్డి, మోనేష్, గోవిందరాజు, ఏఎన్ఎం రామేశ్వరి, ఆప్తాలమిక్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై ఆందోళన వద్దు

మాగనూర్: పంట రుణమాఫీకి సంబంధించిన నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు డీఏఓ జాన్‌సుధాకర్ అన్నారు. మంగళవారం మాగనూర్ రైతువేదికలో అన్నదాతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రుణమాఫీపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొందరు రైతులకు చెందిన రుణ ఖాతాల్లో నిధులు జమ కాలేదని తెలిపారు. సంబంధిత రైతుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీలోగా రుణం పొందిన ప్రతి రైతుకు రుణమాఫీ వర్తిస్తుందన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మండల వ్యవసాయ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక విజ్ఞప్తుల విభాగాల్లో ఫిర్యాదులు అందించాలని సూచించారు. ఇన్‌చార్జి ఏఓ సుదర్శన్‌గౌడ్ ఉన్నారు.

వైభవంగా దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు



నాగంపల్లిలో దేవతా విగ్రహాలకు పూజలు చేస్తున్న ఎంపీ డీకే అరుణ

మద్దూరు: మండలంలోని నాగంపల్లిలో ఆంజనేయస్వామి, గరుడ, బొడ్రాయి (గ్రామదేవత) విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం పండితులు రాఘవేంద్రాచారి, రఘు, హన్వేష్, మధు, నీలగిరి వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా నవగ్రహ, శీతల హోమాలు తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం దేవతా విగ్రహాలు ప్రతిష్ఠించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

- దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో ఎంపీ డీకే అరుణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. గ్రామస్తుల కోసం మాజీ ఎంపీటీసీ వెంకటయ్య ఆలయం నిర్మించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలని సూచించారు. ఎంపీ వెంట బీజేపీ నాయకులు పూనంచంద్ లాహోటి, మదన్, విజయభాస్కర్‌రెడ్డి, రాజు, రఘు, శంకర్, సాయిలు, భరత్ తదితరులు ఉన్నారు.

● గద్వాలలో రాజకీయ వే'ఢీ'

కాంగ్రెస్‌లో దుమారం..!

- సరిత, బండ్ల మధ్య తారస్థాయికి 'అధికార' పోరు
- సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి మంత్రి కాన్వాయ్ అడ్డగింత వ్యవహారం
- దూకుడు యవ్వారం దెబ్బతీస్తోందంటూ అధిష్టానానికి అందిన ఫిర్యాదులు
- అటు ఎమ్మెల్యే బండ్లపై ఆయన వర్గీయుల్లో అసంతృప్తి



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: గద్వాలలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు కాంగ్రెస్‌లో అలజడిని సృష్టిస్తున్నాయి. గద్వాల జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మధ్య వర్గ పోరు ఆ పార్టీని అతలాకుతలం చేస్తోంది. ఇటీవల ప్రాజెక్టుల సందర్శనలో సరిత వర్గీయులు మంత్రి జూపల్లి కృష్ణారావు కాన్వాయ్‌ను అడ్డుకోవడంపై 'హస్తం'లో దుమారం చెలరేగినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లగా.. సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలే ఇలా చేయడం ఏమిటంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మరోవైపు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారనేది చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న పరిణామాల క్రమంలో బండ్లపై ఆయన వర్గీయుల్లో అసంతృప్తి నెలకొంది.

భేటీలోనూ ఘాటు సంభాషణ..?

ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి ఇటీవల గద్వాల నియోజకవర్గానికి వచ్చిన విషయం తెలిసిందే. ముందుగా ఆయన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత ఇరువురు కలిసి ప్రాజెక్టులను సందర్శించేందుకు వెళ్తున్న క్రమంలో సరిత ఇంటికి వెళ్లకుండా ఎలా వెళ్తారని ఆమె వర్గీయులు మంత్రి వాహనాన్ని అడ్డుకున్నారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో మంత్రి చేసేదేమీ లేక సరిత ఇంటికి వెళ్లి ఆమెతో భేటీ అయ్యారు. ఏ సందర్భంలో రావడం జరిగిందో సరితకు మంత్రి వివరించే ప్రయత్నం చేసినట్లు సమాచారం. బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చేరిక నేపథ్యంపై పాత దోస్తాన్‌తో పార్టీలోకి తీసుకొచ్చారనే అంశం చర్చకు రాగా.. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకే జరిగిందని మంత్రి సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఇరువురి మధ్య సంభాషణ ఘాటుగానే సాగినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

తొలి నుంచీ వైరం.. పై'చేయి' కోసం..

బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు సరిత, బండ్ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా వైరం తారస్థాయికి చేరింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న సరిత గులాబీ టికెట్ ఆశించగా నిరాశ ఎదురైంది. దీంతో కాంగ్రెస్ లో చేరిన ఆమె గద్వాల అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి బండ్ల చేతిలో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత పరిణామ క్రమంలో కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో ఇరువురి మధ్య మళ్లీ పోరు తారస్థాయికి చేరింది. ఆయన చేరికను చివరి వరకు అడ్డుకోగా.. అధిష్టానం నచ్చజెప్పడంతో ఆమె వెనక్కి తగ్గారు.

అధిష్టానానికి ఫిర్యాదులు..

సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని ఇటీవలే రాష్ట్రానికి తిరిగొచ్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాత రూ.2 లక్షల లోపు పంట రుణాల మాఫీకి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా పరిస్థితులపై ఆరా తీసిన క్రమంలో గద్వాల ఘటన ఆయన దృష్టికి వచ్చినట్లు సమాచారం. ఈ సందర్భంగా సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రి వాహనాన్ని అడ్డుకోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. నియోజకవర్గంలో అసలేం జరుగుతోందని పార్టీ నేతల ద్వారా ఆరా తీయడంతో పాటు తన వేగుల ద్వారా పూర్తిస్థాయిలో సమాచారం సేకరించాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. మరోవైపు గద్వాలలో ఓ నేత దూకుడు వ్యవహారం కాంగ్రెస్‌ను దెబ్బతీసేలా ఉందని ఆ పార్టీకి చెందిన ముఖ్య నేత ఒకరు అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మంత్రి అడ్డగింతతో పాటు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులపై దాడి ఘటనలు సైతం పెద్దల దృష్టికి వెళ్లినట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. విభిన్న రాజకీయాలకు కేరాఫ్‌గా నిలిచిన గద్వాలలో ఈ పరిణామాలు ఎటువైపు దారి తీస్తాయనేది వేచిచూడాల్సిందే.

క్లుప్తంగా

కిందపడి వ్యక్తి మృతి

జడ్చర్ల: మద్యం తాగిన ఓ వ్యక్తి కిందపడటంతో మృతిచెందాడు. జడ్చర్ల కొత్త బస్టాండ్ సమీపంలోని ఓ వైన్స్ దుకాణం వద్ద మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి(40) మద్యం తాగిన మత్తులో అకస్మికంగా కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బాదేపల్లి ఆస్పత్రిలోని మార్చురీకి తర లించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేఎల్ఐ కాల్వలో పడి వృద్ధురాలు..

నాగర్‌కర్నూల్ క్రైం: కేఎల్ఐ కాల్వలో పడి వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని కుమ్మెరలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కుమ్మెరకి చెందిన రేణుక(60) మతిస్థిమితం సరిగా లేకపోవడంతో సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి గ్రామ సమీపంలోని కేఎల్ఐ కాల్వలో పడి మృతిచెందింది. మంగళవారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి మృతురాలి భర్త రవీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

డెంగీతో బీటెక్ విద్యార్థి..

నాగర్‌కర్నూల్ క్రైం: డెంగీ సోకిన యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధిత కుటుంబం కథనం ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాసులు రెండో కుమార్తె నికిత (21) హైదరాబాద్‌లో బీటెక్ చదువుతుంది. ఇటీవల కళాశాల నుంచి తన ఇంటికి రాగ అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబసభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పరీక్షలు చేయించారు. కాగా ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉండటంతో పాటు డెంగీ లక్షణాలు ఉన్నట్లు తేలింది. దీంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. ఈ క్రమంలోనే పదిరోజులుగా ఆస్పత్రిలో చికిత్సపొందుతూ సోమవారం అర్ధరాత్రి యువతి మృతిచెందింది. విషయంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

లారీని ఢీకొట్టిన బైక్

- వ్యక్తి మృతి, మరొకరి పరిస్థితి విషమం

కోస్గి: ముందుగా వెళ్తున్న లారీని ఓవర్‌టెక్ చేసే క్రమంలో అదుపు తప్పి లారీని బైక్ ఢీకొట్టి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా.. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన పట్టణంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం కుదురుమళ్లకి చెందిన కృష్ణయ్య(52) అదే గ్రామానికి చెందిన చందర్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై కోస్గికి బయలుదేరాడు. ఈ క్రమంలో కోస్గి పట్టణ శివారులో బస్‌డిపో సమీపంలో తాండూర్ నుంచి తమిళనాడుకు లారీ బండల లోడ్‌తో వెళ్తుంది. లారీని ఓవర్ టెక్ చేసే క్రమంలో బైక్ అదుపు తప్పి లారీని బలంగా ఢీకొట్టింది. దీంతో కృష్ణయ్య తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ నడుపుతున్న చందర్‌కు సైతం తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ సంఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు లారీని అదుపులోకి తీసుకొని కేసును దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

కృష్ణా: చికిత్సపొందుతూ ఐనాపూర్‌నకు చెందిన రామలింగమ్మ భర్త జగదీష్(27) మృతి చెందారు. ఎస్ఐ నవీద్ కథనం ప్రకారం.. ఐనాపూర్ రామలింగమ్మకు నాలుగేళ్ల క్రితం కర్ణాటకలోని కరెకల్‌కి చెందిన జగదీష్‌తో వివాహం జరిగింది. కాగా పెళ్లి అయినప్పటి నుంచి అతడు తాగి ఇంటికి వచ్చి నిత్యం గొడవపడే వాడు. రెండు రోజుల క్రితం దంపతులిద్దరూ ఐనాపూర్‌నకు వచ్చారు. ఆ సమయంలో జగదీష్ తాగిన మైకంలో కుటుంబ సభ్యుల ఎదుటే ఇంట్లో ఉన్న పురుగుల మందును తాగాడు. ఆస్పత్రికి తరలించగా.. మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని పెద్ద చెరువు సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బల్సుపల్లికి చెందిన హన్మంతు(30) తీవ్రంగా గాయపడ్డారు. అతడు బైక్‌పై మహబూబ్‌నగర్ వెళ్తుండగా పెద్ద చెరువు సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఘటనలో అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కాగా ఆ సమయంలో అదే దారిలో వస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తన వాహనాన్ని ఆపి పోలీసులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సకాలంలో అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో మరో వాహనం తెప్పించి హన్మంతును జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీకి రాఖీ ‘పండగ’

- మహబూబ్‌నగర్ రీజియన్‌కు రూ.2.88 కోట్ల ఆదాయం
- గతేడాది కంటే రూ.89 లక్షలు అధికం
- రాష్ట్రంలోనే అత్యధిక ఓఆర్ సాధించిన రీజియన్



ఈ నెల 19 డిపోల వారీగా వచ్చిన ఆదాయం (రూ.లక్షల్లో)

డిపో	తిరిగిన కిలోమీటర్లు	ఆదాయం
మహబూబ్‌నగర్	56,820	42.61
వనపర్తి	47,099	37.46
కల్వకుర్తి	42,610	35.82
గద్వాల	48,879	34.14
అచ్చంపేట	34,356	28.20
షాద్‌నగర్	33,847	28.14
నారాయణపేట	36,826	28.13
నాగర్‌కర్నూల్	34,203	28.01
కొల్లాపూర్	31,631	22.32
కోస్గి	5,032	3.57

స్టేషన్ మహబూబ్‌నగర్: రాఖీ పండగ సందర్భంగా మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌కు రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు సర్వీసులు నడిపారు. ముఖ్యంగా ఆయా డిపోల నుంచి హైదరాబాద్ రూట్‌లో ఎక్కువ బస్సులు నడిపించడంతో అధిక ఆదాయం లభించింది. గతేడాది రాఖీ పండగ రోజు రీజియన్ రూ.1.99కోట్ల ఆదాయం వస్తే.. ఆసారి ఆ రికార్డును బ్రేక్ చేసి రూ.2,88 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసుకుంది. పండగ రోజు రీజియన్ వ్యాప్తంగా బస్సులు 3.71 లక్షల కిలోమీటర్ల మేర నడిచాయి. గత రాఖీ పండగతో పోల్చితే ఈసారి బస్సులు 12 వేల కిలోమీటర్లు అదనంగా తిరిగాయి. గతేడాది 3.84 లక్షల మంది బస్సుల్లో ప్రయాణించగా.. ఈ సారి 5.88 లక్షల మంది రాకపోకలు సాగించారు. సోమవారం టీజీఎస్ ఆర్టీసీ కార్పొరేషన్‌లోనే మహబూబ్‌నగర్ రీజియన్ అత్యధిక 131 శాతం ఆక్యుపెన్సీ రేషియోను నమోదు చేసి ఆల్‌టైం రికార్డును సాధించింది. కాగా.. అత్యధికంగా మహబూబ్‌నగర్ డిపో రూ.42.61 లక్షలు, వనపర్తి డిపో రూ.37.46 లక్షలు, కల్వకుర్తి డిపో రూ.35.82 లక్షలు, గద్వాల డిపో రూ.34.14 లక్షల అధిక ఆదాయాన్ని పొందాయి.


మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల సందడి

సిబ్బంది సమష్టి కృషితోనే..

అన్ని డిపోల డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది సమష్టి కృషితో రీజియన్‌కు మంచి ఆదాయం వచ్చింది. మహిళా కండక్టర్లు, సిబ్బంది ఇళ్లకు వెళ్లకుండా విధులు నిర్వర్తిస్తూ తోటి డ్రైవర్లు, కండక్టర్లకు రాఖీలు కట్టి డిపోల్లోనే పండగ చేసుకున్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస్టాండ్లలో పర్యవేక్షణ నిర్వహించాం. ఉమ్మడి జిల్లా ప్రజలు ఇలాగే ఎల్లప్పుడూ ఆర్టీసీని ఆదరించాలి.

– శ్రీదేవి, రీజినల్ మేనేజర్

బంగారం కొని.. నకిలీదని తెలిసి...
మోసపోయిన నలుగురు

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు


నకిలీ బంగారమని చూపిస్తున్న బాధితుడు పెద్ద బాల్‌రెడ్డి

నర్వ: తక్కువ ధరకు వస్తుందంటూ రెండున్నర కిలోల బంగారం కొనుగోలు చేశారు.. తీరా అది నకిలీదని తెలిసి మోసపోయామని గుర్తించి పోలీసులను ఆశ్రయించిన ఘటన మంగళవారం ఆలస్యంగా నర్వ మండలం నాగిరెడ్డిపల్లిలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన రామాంజనేయులు ఇంటికి 15 రోజుల కిందట అనంతపురం జిల్లాకు చెందిన ఓ కుటుంబం అడుక్కునేందుకు వచ్చింది. వీరికి బియ్యం, కొంత నగదు అందజేయగా వారు కృతజ్ఞత చూపుతూ తక్కువ ధరకు బంగారం ఉందని ఓ అడ్రస్ ఇచ్చారు. దీంతో రామాంజనేయులు, అతడి స్నేహితుడు వెంకటేష్ కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా కదిరి మండలంలోని ఓ గ్రామానికి వెళ్లారు. వీరిని నమ్మించేందుకు అక్కడి వారు ఓ మాసం బంగారం శాంపిల్‌గా ఇచ్చారు. గ్రామానికి వచ్చి పరీక్షించగా నాణ్యమైనదని తేలడంతో ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నారు. వారి వద్ద డబ్బులు లేకపోవడంతో గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్ద బాల్‌రెడ్డిని ఆశ్రయించి జరిగిన విషయం చెప్పి కొంత డబ్బు ఇవ్వాలని.. ఇందు కోసం భూమి తాకట్టు పెట్టేందుకు సిద్ధమయ్యారు. మరోమారు నలుగురు కలిసి కదిరికి వెళ్లి మరో మాసం బంగారం తీసుకొచ్చారు. అదికూడా నాణ్యమైందని తేలడంతో 2.50 కిలోల బంగారు ఆభరణాలను కేవలం రూ.12 లక్షలకు కొనుగోలు చేసేందుకు డీల్ కుదుర్చుకొని కారులో నలుగురు కదిరి బయలుదేరారు. డబ్బులన్నీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డివే కావడంతో తీసుకొచ్చిన బంగారంలో అందరూ సమాన వాటాలు పంచుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇంటికి తిరుగొచ్చాక నాగల్‌కడ్మూర్‌లో పరీక్షించగా నకలీదని తేలింది. తాము మోసపోయినట్లు నిర్ధారణకు వచ్చి సగం డబ్బులు ఇవ్వాలంటూ రామాంజనేయులు, వెంకటేష్‌పై ఒత్తిడి తీసుకొచ్చారు. చివరకు గ్రామంలో పంచాయితీ నిర్వహించినా తేలకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ కురుమయ్యను వివరణ కోరగా కేసు నమోదుకు ఎలాంటి ఆధారాలు లేవని.. గ్రామంలోనే పరిష్కరించుకోవాలని సూచించినట్లు వివరించారు.

మాయమాటలు చెప్పి.. బంగారంతో ఉడాయింపు

కోస్గి: గుర్తు తెలియని ఓ వ్యక్తి మాయమాటలు చెప్పి బంగారంతో ఉడాయించిన ఘటన పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ బీవీ రమణ కథనం మేరకు.. పుర పరిధిలోని నాగుసాన్‌పల్లికి చెందిన ఊరుముందలి బాలయ్య తన ద్విచక్ర వాహనంపై కోస్గి నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. పట్టణ శివారులోని చెక్‌పోస్టు సమీపంలో ఓ వ్యక్తి వాహనం ఆపి బంగారు వస్తువులుంటే జేబులో దాచుకోవాలని నమ్మించి చేతికి ఉన్న బంగారు ఉంగరం దాచి ఇస్తానంటూ ఓ పేపర్‌లో చిన్న రాయిని ఉంచి ఇచ్చాడు. కొంతదూరం వెళ్లాక అనుమానం వచ్చిన బాలయ్య కాగితం విప్పి చూడగా రాయి కనిపించడంతో మోసపోయినట్లు గుర్తించి గుర్తు తెలియని వ్యక్తి కోసం గాలించాడు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

భారీ ఇసుక డంపు సీజ్



మాగనూర్: మండల శివారులోని భారీ ఇసుక డంపును సీజ్ చేసినట్లు మాగనూర్ ఎస్ఐ అశోక్‌బాబు, ఆర్ఐ శ్రీశైలం తెలిపారు. వారి కథనం ప్రకారం.. మాగనూర్ మండల శివారులో మక్తల్‌కు చెందిన సీఎస్ మూర్తి సుమారు 20 టిప్పర్ల వరకు ఇసుక డంపు చేసి నిల్వ ఉంచారు. కాగా సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. డంపును స్వాధీనం చేసుకుని ఆర్ఐ శ్రీశైలంనకు అప్పగించారు. అయితే మాగనూర్ మండల ప్రజలు ఈ విషయంపై స్పందిస్తూ గతంలో కూడా అనే చోట్ల డంపులను గుర్తించి సీజ్ చేసిన ఇసుకను యథేచ్ఛగా కొందరు అక్రమార్కులు తరలించుకుపోతున్నారని ఆరోపిస్తున్నారు. సీజ్ చేసిన ఇసుకను వెంటనే ప్రభుత్వ పనులకు తరలించాలని కోరుతున్నారు.

రహదారి బ్రిడ్జికి గండి

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నె, కల్వరాల గ్రామాల మధ్య జూరాల కాల్వపై నిర్మించిన బ్రిడ్జికి సోమవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా గండిపడింది. భారీ వర్షం కురవడం వల్ల రైతుల పంట పొలాలకు చేరిన నీరు బ్రిడ్జిపైకి చేరుకోవడంతో బ్రిడ్జి పక్కన నుంచి వరదం ప్రవహించి బ్రిడ్జికి కొంత మేర గండిపడింది. రాబోయే రోజుల్లో అధికారులు మరమ్మతులు చేయకుంటే బ్రిడ్జి కూలే ప్రమాదం ఉందని సమీప రైతులు అంటున్నారు. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి వెంటనే బ్రి డ్జికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



వృద్ధ దంపతులకు పాముకాటు



చికిత్స పొందుతున్న ఎల్లమ్మ, రామయ్య దంపతులు

- ఆస్పత్రికి తరలింపు.. వృద్ధుడి పరిస్థితి విషమం

గండేడ్: ఇంట్లో నిద్రించిన వృద్ధ దంపతులను పాముకాటు వేసింది. దీంతో బాధితులను ఆస్పత్రికి తరలించగా.. వృద్ధుడి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొమిరెడ్డిపల్లికి చెందిన బండకాడి రామయ్య, ఎల్లమ్మ దంపతులు రోజులాగే భోజనం చేసి సోమవారం రాత్రి ఇంట్లో నిద్రించారు. అయితే మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో ఎల్లమ్మ కుడి చేతికి నాగుపాము చుట్టుకోగా మెలకువ వచ్చి పాము అని అరిచింది. దీంతో నిద్రలేచిన భర్త రామయ్య పాము భార్య చేతికి ఉండటాన్ని గమనించాడు. వెంటనే పక్కనే ఉన్న కొడవలి తీసుకుని పామును సగానికి కోశాడు. దీంతో పాము రామయ్య, ఎల్లమ్మ ఇద్దరినీ కాటేసింది. కానీ భార్య చేతిని వదలకపోవడంతో మరో మూడు సార్లు కోయగా.. ఈ సమయంలోనే రామయ్యను పాము దాదాపు పదిసార్లు అరచేతిలో కాటేసింది. వృద్ధ దంపతుల కేకలతో నిద్రలేచిన కోడలు రామేశ్వరమ్మ వెంటనే తన భర్త అనిల్‌కు ఫోన్ చేసి చెప్పింది. ఆయన ఇంటికి వస్తూ 108కు సమాచారం అందించాడు. కానీ, 108 సిబ్బంది వేరే కేసులో బిజీగా ఉన్నామని, వేరే వాహనం తీసుకెళ్లాలని సూచించారు. దీంతో కారులో వృద్ధ దంపతులు ఇద్దరినీ మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అయితే రామయ్యను పాము ఎక్కువ సార్లు కాటు వేయడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెప్పారని కుటుంబీకులు పేర్కొన్నారు.

న్యాయం చేయాలని అర్ధనగ్న ప్రదర్శన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట అర్ధనగ్నంగా కూర్చున్న శ్రీను

దేవరకద్ర: న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓ భూ బాధితుడు, గూరకొండ గ్రామానికి చెందిన దాసరి శ్రీను అర్ధనగ్న ప్రదర్శన చేశాడు. అతడు విలేకరులకు తెలిపిన కథనం ప్రకారం.. శ్రీను తండ్రి దాసరి దాసన్నకు 5 మంది కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కాగా ఆయన చెవిటి వాడని పెన్షన్ ఇప్పిస్తామని సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చి సర్వే నంబర్ 194, 195, 196, 199 లో వారసత్వంగా వచ్చిన మూడున్నర ఎకరాల భూమిని... శ్రీను తమ్ముడు రాములు, రాములు భార్య, మరో తమ్ముడి తమ పేరు మీదుగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆ సమయంలో దాసన్నకు ఎంత మంది కుమారులు, కుమార్తెలు ఉన్నారనే విషయంపై అధికారులు విచారణ చేయలేదు. కాగా విషయం తెలిసిన శ్రీను ఫోన్ చేసి తాము పది నిముషాల్లో అక్కడికి వస్తామని.. రిజిస్ట్రేషన్ ఆపాలని కోరినా అలాగే మార్చేశారు. కాగా తహసీల్దార్‌ను అడిగితే కోర్టుకు వెళ్లమని సలహా ఇస్తున్నాడని శ్రీను ఆరోపించారు. వారసత్వంగా వచ్చే భూమి లేకుండా ఎలా బతకాలని.. భూమి ఇవ్వకుంటే తహసీల్దార్ పేరు మీద లెటర్ రాసి చనిపోతానని ఆవేదన వ్యక్తం చేశాడు. తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా పట్టాదారు అయిన దాసరి దాసన్న స్లాట్ బుక్ చేసి రిజిస్ట్రేషన్ చేశాడని తప్పు జరిగినట్లయితే విచారణ చేసి.. సవరించి బాధితునికి న్యాయం చేస్తామని తెలిపారు. కాగా దేవరకద్ర కాంగ్రెస్ నాయకులు ఆదిహన్మంతరెడ్డి, గూరకొండ మాజీ సర్పంచ్ ఉసేనప్ప తహసీల్దార్‌తో రిజిస్ట్రేషన్ విషయమై చర్చించారు. ఎలాగైనా బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. విచారణ చేసి జరిగిన పొరపాటును సరిదిద్దాలని వారసత్వంగా వచ్చిన భూమిని అందరికీ సమభాగంగా వచ్చేలా చూడాలని కోరారు.

అలంపూర్ ఆలయాలపై
కేంద్ర బృందం పరిశోధన


గరుడ బ్రహ్మ ఆలయంలో ఫొటోలు తీసుకుంటున్న కేంద్ర అధ్యయన బృందం

- చరిత్ర, శాసనాలు, శిల్పాలు, సంస్కృతి, సంప్రదాయలపై అధ్యయనం

జోగుళాంబ శక్తిపీఠం: చరిత్ర పరిశోధకులకు అలంపూర్ ఆలయాలు ఓ భాండాగారమని.. అనేక శిల్పాలు, చిత్ర బంధనం, శాసనాలు అబ్బురపరుస్తున్నాయని ప్రొఫెసర్ మహాలక్ష్మి రామకృష్ణన్ అన్నారు. మంగళవారం ఆమె నేతృత్వంలో కేంద్ర అధ్యయన బృందం డా.స్వప్న, లిడిల్, డా.దీప్నా.కె, సహాయ కమిషనర్ శ్రీనివాసరాజు అలంపూర్ ఆలయాలను సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయశాఖ ఆదేశాల మేరకు ఈఓ పురేందర్‌కుమార్ ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి ఉభయ ఆలయాల్లో దర్శనాలు, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారు బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంతో పాటు కుమారబ్రహ్మ, అర్కబ్రహ్మ, వీరబ్రహ్మ, విశ్వబ్రహ్మ, తారకబ్రహ్మ, గరుడబ్రహ్మ, పద్మ, స్వర్గబ్రహ్మ ఆలయాలను, శిల్ప సంపదలను తిలకిస్తూ తమ కెమెరాల్లో బంధించారు. జోగుళాంబ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బండి శ్రీనివాస్ ఇక్కడి సంస్కృతి సంప్రదాయాల గురించి బృందానికి వివరించారు. ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ, ఈఓతో మాట్లాడి చరిత్రకు సంబంధించిన పలు అంశాలను తెలుసుకున్నారు. ఆలయాలను 7వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం వరకు చాళక్యుల కాలంలో రెండవ పులకేశి నిర్మించినట్లు ఆనంద్‌శర్మ వివరించారు. ఆలయాలు నాగరిక శైలిని పోలి ఉంటాయని.. మ్యూజియంలో వినయాధిత్యుడు, విక్రమాధిత్యుడి శాసనాలు ఉన్నాయన్నారు. అనంతరం ప్రొ. మహాలక్ష్మి రామకృష్ణన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం తమ బృందం మూడురోజుల పాటు యాదగిరిగుట్ట, అలంపూర్, బాసర ఆలయాలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. సమయాభావంతో కొంత సమాచారం సేకరించామని మరోమారు ఈ ప్రాంతాన్ని సందర్శించి పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తామన్నారు. ఇక్కడి ఆలయాల్లోని శాసనాలు, శిల్పసంపద, చరిత్ర విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఆలయాల నిర్వహణ తీరు బాగుందంటూ ఈఓను అభినందించి పలు సూచనలు చేశారు. ఈఓ వారికి అమ్మవారి శేష వస్త్రాలు, జ్ఞాపిక అందజేశారు.

అసత్య ప్రచారాలతో పైశాచిక ఆనందం


మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ లోక్‌సభ సభ్యుడు మల్లురవి

వనపర్తి రూరల్: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చి అన్ని హామీలను అమలు పరుస్తుందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి అన్నారు. మంగళవారం ఆయన పెబ్బేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయ అస్తిత్వాన్ని కోల్పోయిన బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు అబద్ధపు, అసత్య ప్రచారాలతో పైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు. తెలంగాణలో రాచరికపు పాలనకు స్వస్తి పలికి ప్రజాపాలన విజయవంతంగా సాగుతున్న తరుణంలో దాన్ని జీర్ణించుకోలేక ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామన్నారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీలో భాగంగా ఇప్పటి వరకు రూ.17 వేల కోట్లు ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమ చేశామని, ఇంకా రాని వారికి కూడా త్వరలోనే వేస్తామన్నారు. 40 ఏళ్లుగా పెబ్బేరు సంతలో వేలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారని, సంత జరిగే స్థలం ఎప్పటికీ అక్కడే కొనసాగేలా చూస్తామన్నారు. ఇందులో పూజారులను తప్పు పట్టాల్సిన అవసరం లేదని, వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పించి పెబ్బేరులో యథావిధిగా ఉండేలా తనతోపాటు ఎమ్మెల్యే మేఘారెడ్డి సీఎం, దేవాదాయ శాఖ మంత్రితో సంప్రదింపులు జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు సురేందర్‌గౌడ్, వెంకటేష్ సాగర్, సుశీల, అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

భారత్‌బంద్‌కు సహకరించండి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయ్య

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ, ఎస్టీల ఉప కులాల వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, భీమ్‌సేన, ట్రైబల్ ఆర్మీ పిలుపుమేరకు మహబూబ్‌నగర్ జిల్లా బంద్ చేయాలని నిర్ణయించామని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయ్య తెలిపారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు రాజ్యాంగా విరుద్ధమైన తీర్పునిచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికి సుప్రీంకోర్టు తీర్పుగా కాకుండా.. నరేంద్రమోదీ తీర్పుగానే భావిస్తున్నామన్నారు. భారత్ బంద్‌కు ఆర్టీసీ, విద్యాసంస్థలు, వ్యాపార సముదాయాలు యజమానులు సహకరించాలని కోరారు. సమావేశంలో మాలల చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మూలె కేశవులు, జాతీయ మాల మహానాడు రాష్ట్ర కోఆర్డినేటర్ బ్యాగరి వెంకటస్వామి, కాటికాపరుల బ్యాగరి సంఘం జాతీయ అధ్యక్షుడు కేశవులు, మాల మహానాడు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కానుగడ్డ యాదయ్య, జాతీయ మాలల ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కంచిమి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు లేకపోతే ఎలా?

- ఎంపీడీఓను ప్రశ్నించిన గండేడ్ గ్రామస్తులు


ఎంపీడీఓ దేవన్నను నిలదీస్తున్న గండేడ్ గ్రామస్తులు

గండేడ్: మండల కేంద్రంలో దాదాపు నెలరోజులుగా నీటి సమస్య నెలకొంది. అరకొరగా నీటి సరఫరాతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పదిరోజులుగా సమస్య మరింత జఠిలమైంది. దీంతో గ్రామంలో ట్యాంకరు పెట్టి నీటిని అందించారు. కానీ అది ఎందుకు సరిపోవడం లేదు. విషయాన్ని ఎన్నిసార్లు చెప్పినా ఎవరు పట్టించుకోకపోగా పరిష్కరించలేదు. ఇక చేసేది లేక మంగళవారం గ్రామస్తులు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకొని గ్రామ స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ దేవన్నను ప్రశ్నించారు. ఎన్ని రోజులు నీటి కోసం అవస్థలు పడాలని నిలదీశారు. వేసవిలో కూడా తాము ఇంతగా ఇబ్బంది పడలేదని పేర్కొన్నారు. కాగా ఎంపీడీఓ స్పందిస్తూ రోడ్డు పనులు జరుగుతుండడంతో పాటు పై నుంచి సమస్య ఉండడం వల్ల మిషన్‌భగీరథ నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. బుధవారం రెండు కొత్త మోటార్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో గ్రామస్తులు వెళ్లిపోయారు.

24న వర్క్‌షాప్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: నూతన ఆర్ఓఆర్– 2024 చట్టంపై శనివారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయేందిర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రజలు, భూమి సంబంధిత అంశాలపై పనిచేస్తున్న ఎన్జీఓలు, రిటైర్డ్ రెవెన్యూ అధికారులతోపాటు ఆసక్తి గలవారు పాల్గొనాలని కోరారు.


పరదా కడితే.. పడదా?

పెచ్చులు కిందపడకుండా పరదాలు కట్టిన వైనం

పెనుగొండ జెడ్పీ పాఠశాలలో పిల్లల దుస్థితి



పెనుగొండ జెడ్పీ హైస్కూల్ స్లాబ్‌కు పరదాలు కట్టిన దృశ్యం.. చదువుకుంటున్న విద్యార్థులు



పెనుగొండ హైస్కూల్‌లోని గదిలోని పెచ్చులూడిన స్లాబ్

కేసముద్రం: తరగతి గదుల్లో స్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్న ఓ బడిలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువు నెట్టుకొచ్చేస్తున్నారు. తాత్కాలికంగా పరదాలు కట్టి అడ్డు పెట్టినా ఒక్కోసారి పెద్ద పెద్ద పెచ్చులను పరదాలు కూడా ఆపలేక పోతున్నాయి. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పిల్లల దుస్థితి మాత్రం మారలేదు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండ జెడ్పీ హైస్కూల్‌లో 165 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 9 గదులకు గాను ఒక గది స్టోర్ రూం, మరో గది స్టాఫ్‌కు కేటాయించారు. పాఠశాలలో స్లాబ్ శిథిలావస్థకు చేరుకోవడంతో పెచ్చులు ఊడిపడుతూ, ఇనుప సలాక్‌లు కిందకు వేలాడుతున్నాయి. ఇలా నాలుగు తరగతి గదుల్లో పై పెచ్చులు పడుతుండటంతో వాటిని తప్పించుకునేందుకు పిల్లలు ప్రాణభయంతో బయటకు పరుగులు తీస్తున్నారు. ఇక వర్షం పడినప్పుడల్లా స్లాబ్ కురుస్తుండటం, దాంతో పాటు పెచ్చులు పడుతుండటంతో పిల్లలను పక్కనే ఉన్న డైనింగ్ హాల్‌లో కూర్చోబెడుతున్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి తెలిపారు.

కెమికల్ లోడ్ మాటున గంజాయి తరలింపు

- రూ 1.80 కోట్ల విలువైన సరుకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్



దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్

దమ్మపేట: కెమికల్ లోడ్ మధ్యలో గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న రూ 1.80 కోట్ల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు. దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఒడిశా నుంచి కెమికల్ లోడుతో మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాకు వెళ్తున్న డీసీఎం వ్యాన్‌ను దమ్మపేట మండలం అచ్యుతాపురం క్రాస్‌రోడ్డు వద్ద టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు తనిఖీ చేశారు. వాహనం కింద భాగంలో 247 ప్యాకెట్లలో తరలిస్తున్న 508 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నాసిక్ జిల్లాకు చెందిన 12 మంది ముఠాగా ఏర్పడి గంజాయి తరలిస్తున్నారని, అక్కడ చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి పుణె, ముంబై వంటి నగరాల్లో విక్రయిస్తుంటారని ఎస్పీ తెలిపారు. ఈ ముఠాలోని ఆరుగురిని అరెస్ట్ చేశామని, గంజాయి సరఫరా చేసిన కోరాపూట్ జిల్లాకు చెందిన శ్రీనుతోపాటు మిగతా ఆరుగురు పరారీలో ఉన్నారని చెప్పారు. గంజాయి తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించామని, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని పేర్కొన్నారు. గంజాయి నియంత్రణలో తెలంగాణలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రథమ స్థానంలో ఉందని, ఏడాది కాలంలో 62 కేసులు నమోదు చేసి రూ. 20 కోట్ల విలువైన 6,500 కిలోల గంజాయిని సీజ్ చేశామని వివరించారు. సమావేశంలో అశ్వారావుపేట సీఐ కరుణాకర్, టాస్క్‌ఫోర్స్ సీఐ బెల్లం సత్యనారాయణ, ఎస్సైలు సాయికిషోర్‌రెడ్డి, జలకం ప్రవీణ్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి భర్త.. ఉరేసుకుని భార్య ఆత్మహత్య

సంతానం లేకపోవడంతో దంపతుల మధ్య కలహాలు



మృతిచెందిన దంపతులు గురువయ్య, వెంకటమ్మ(ఫైల్)

బెల్లంపల్లి రూరల్: సంతానం కలుగకపోవడం ఆ దంపతుల మధ్య కలహాలకు కారణమైంది. ఘర్షణకు దారితీసి భార్యపై చేయి చేసుకోవడంతో ఆమె ఆస్పత్రి పాలైంది. దీంతో వేదనకు గురైన భర్త క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భర్తకు దూరమై జీవించలేక భార్య ఉరేసుకుని తనువు చాలించింది. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం బుధాకుర్దు గ్రామంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్ రమేశ్, గ్రామస్తుల కథనం ప్రకారం.. బుధాకుర్దు గ్రామ పంచాయతీ పరిధి కాసిరెడ్డిపల్లెకు చెందిన గురువయ్యతో వెంకమ్మ అలియాస్ వెంకటమ్మకు ఇరవై ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కూలి పనులు చేసుకుంటూ వారు జీవనం సాగిస్తున్నారు. ఇన్నేళ్లయినా సంతానం కలుగకపోవడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు తలెత్తేవి. ఒక్కోసారి తీవ్ర ఘర్షణకు దారి తీసేవి. ఈ క్రమంలో గత ఆదివారం గురువయ్య తన భార్య వెంకటమ్మతో గొడవపడి ఆమెను తీవ్రంగా కొట్టడంతో ఆస్పత్రి పాలైంది. తన వల్లే భార్య ఆస్పత్రిపాలు కావడం, మరోవైపు తమకు సంతానం కలగడం లేదని తీవ్ర మనస్తాపానికి గురైన గురువయ్య అదే రోజు క్రిమి సంహారక మందు తాగాడు. బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి చనిపోయాడు. అంత్యక్రియలు పూర్తి చేసిన వెంకటమ్మ.. భర్త మరణాన్ని తట్టుకోలేక సోమవారం అర్ధరాత్రి ఇంటి ముందు ఉన్న చెట్టుకు చీరతో ఉరేసుకుంది. అందరితో కలివిడిగా ఉండే దంపతులు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కూతురి పెళ్లి డబ్బుల కోసం హత్య

- కల్లు సీసా ఆధారంగా కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ క్రైం: కూతురి పెళ్లి చేసేందుకు అవసరమైన డబ్బు కోసం పథకం ప్రకారం ఓ మహిళను మరో మహిళ హత్య చేసింది. ఘటనా స్థలంలో దొరికిన కల్లు సీసా ఆధారంగా విచారణ చేసిన పోలీసులు నిందితురాలిని పట్టుకున్నారు. ఈ మేరకు మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. నవాబ్‌పేటకు చెందిన లక్ష్మమ్మ (48) కొడుకు, కోడలు హైదరాబాద్‌లో ఉండటంతో ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. నవాబ్‌పేటకు చెందిన పద్మమ్మకు లక్ష్మమ్మతో పాత పరిచయం ఉండటంతో ఇద్దరూ కలిసి నిత్యం కల్లు తాగేవారు. ఈ క్రమంలోనే పద్మమ్మ ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోవడంతో పాటు కూతురి పెళ్లికి డబ్బులు కావాల్సి వచ్చాయి. దీంతో ఎలాగైనా లక్ష్మమ్మను హత్య చేసి ఆమె దగ్గర ఉన్న బంగారం, వెండి తీసుకోవాలని పథకం వేసింది. ఏప్రిల్ 12న రాత్రి ఇద్దరూ కలిసి కల్లు తాగిన తర్వాత లక్ష్మమ్మ నిద్రపోతున్న సమయంలో పద్మమ్మ అర్ధరాత్రి సమయంలో రోకలిబండతో తలపై బాది హత్య చేసింది. ఆ తర్వాత ఆమె దగ్గర ఉన్న 30 తులాల వెండి, ఒక తులం బంగారం, సెల్‌ఫోన్ తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటనపై నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేయగా ఇంట్లో దొరికిన కల్లుసీసా ఆధారంతో పాటు టెక్నికల్ క్లూస్ సేకరించిన సాక్ష్యాలతో నిందితురాలిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. పద్మమ్మను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామని డీఎస్పీ చెప్పారు. సమావేశంలో రూరల్ సీఐ గాంధీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్సే కవితకు బెయిల్ ఇప్పిస్తోంది



ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలతో కేసీఆర్ కుమ్మక్కు: బండి సంజయ్

మహేశ్వరం: కేసీఆర్ కూతురు కవితకు కాంగ్రెస్ పార్టీయే బెయిల్ ఇప్పిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇందుకు సంబంధించిన కేసును కాంగ్రెస్ నుంచి కాబోయే రాజ్యసభ సభ్యుడు అభిషేక్ సింఘ్వీయే కోర్టులో వాదిస్తున్నారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాలలో మంగళవారం నిర్వహించిన సూర్యగిరి రేణుక ఎల్లమ్మ ఉత్సవాలకు హాజరైన సంజయ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలతో కేసీఆర్ మ్యాచ్ ఫిక్సింగ్ చేస్తున్నారనడానికి ఇదే నిదర్శనమన్నారు. కేసీఆర్ సూచించిన వారికే రాష్ట్రంలో మంత్రి పదవులు, నామినేటెడ్ పోస్టులు, రాజ్యసభ సీట్లు వస్తున్నాయని తెలిపారు. ఈ విషయం తెలిసిన కాంగ్రెస్ నేతలు కేసీఆర్ ఫాంహౌస్‌కు క్యూ కడుతున్నారని వ్యాఖ్యానించారు. అభిషేక్ సింఘ్వీ అనుభవజ్ఞుడైన న్యాయవాది అని, ఆయన తెలంగాణ నుంచి ఎంపీ అయితే రాష్ట్ర ప్రయోజనాల కోసం కోర్టుల్లో, పార్లమెంట్‌లో గట్టిగా వాదిస్తారనుకుంటే .. లిక్కర్ కేసులో అరెస్టయి జైల్లో ఉన్న కవిత బెయిల్ కోసం వాదిస్తున్నారని ఎద్దేవా చేశారు.

చందాదారులెవరు?

▶ మొదటి పేజీ తరువాయి

దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టివేస్తూ ఉమ్మడి హైకోర్టు 2018 డిసెంబర్ 31న తీర్పునిచ్చింది. అయితే అనంతరం ఈ తీర్పును సవాల్ చేస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (వైఎస్సార్ సీపీ హయాంలో) సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేశాయి. మరోవైపు తీర్పులో కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మార్గదర్శి, రామోజీరావు కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లు అన్నింటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం హైకోర్టు ఇచ్చిన తీర్పును 2024 ఏప్రిల్ 9న కొట్టివేసింది. హైకోర్టు తీర్పును తప్పుబడుతూ.. మార్గదర్శి డిపాజిట్ల సేకరణకు సంబంధించి వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిందేనని స్పష్టం చేసింది. ఉండవల్లి, ఏపీ సర్కార్ సహా అందరి వాదనలు వినాలని పేర్కొంది.

మార్గదర్శి అక్రమాలను ఆర్బీఐ కౌంటర్‌లో తేల్చింది..: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో తెలంగాణ హైకోర్టు తాజాగా మరోసారి విచారణ ప్రారంభించింది. సీనియర్ జడ్జి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టాలన్న అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వాన్ని, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)ని ప్రతివాదుల జాబితాలో చేర్చింది. గత విచారణ (ఈనెల 6వతేదీన) సందర్భంగా కౌంటర్ దాఖలుకు చివరి అవకాశం ఇవ్వాలన్న ఆర్‌బీఐ వినతికి అంగీకరిస్తూ ఇకపై ఈ పిటిషన్లను మోషన్ లిస్ట్‌లో పేర్కొనాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ క్రమంలో మార్గదర్శి ఫైనాన్షియర్స్ వసూలు చేసిన డిపాజిట్లన్నీ చట్టవిరుద్ధం, అక్రమమేనని, అందుకు బాధ్యులను ప్రాసిక్యూట్ చేయాలని నివేదిస్తూ ఈ నెల 13న ఆర్బీఐ తెలంగాణ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసింది. ఈ క్రమంలో మంగళవారం జస్టిస్ సుజోయ్‌పాల్ నేతృత్వంలోని ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా, కోర్టు సహాయకులుగా మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆన్‌లైన్‌లో హాజరయ్యారు. ఏపీ ప్రభుత్వ న్యాయవాదితోపాటు తెలంగాణ ప్రభుత్వం తరఫున న్యాయవాది పల్లె నాగేశ్వర్‌రావు, ఆర్బీఐ న్యాయవాది కె.రతంగపాణిరెడ్డి హాజరయ్యారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారిస్తూ చట్టం 45 (ఎస్)ను ఉల్లంఘించినట్లు ఆర్బీఐ కౌంటర్‌లో తేల్చిందని ఈ సందర్భంగా ఉండవల్లి హైకోర్టు దృష్టికి తెచ్చారు. దీని ఆధారంగా మార్గదర్శిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని నివేదించారు. దాదాపు 70 వేల మంది చందాదారుల వివరాలను 1,500కిపైగా పేజీల్లో మార్గదర్శి సుప్రీం కోర్టుకు సమర్పించిందని, ఆ వివరాలను హైకోర్టుకు కూడా పెన్‌డ్రైవ్‌లో అందజేసేలా ఆదేశించాలని కోరారు. దీనిపై జస్టిస్ సుజోయ్‌పాల్ స్పందిస్తూ.. వివరాలు కోరుతూ ఓ అఫిడవిట్ దాఖలు చేయాలని, ఆ మేరకు ఆర్బీఐ, మార్గదర్శికి ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొంటూ తదుపరి విచారణను వాయిదా వేశారు.

అందరినీ అనుమతించాం

బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాఖీ పండుగ రోజున విద్యార్థినుల తల్లిదండ్రులు, సోదరులను గురుకులంలోనికి అనుమతించామని రాజన్న సిరిసిల్ల జిల్లా బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ చెప్పారు. మంగళవారం ఆమె కలెక్టర్‌కు వివరణ ఇస్తూ లేఖ రాశారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రుల రాక మొదలు కాగా, జోనల్ ఆఫీసర్ సూచనల మేరకు అనుమతించామన్నారు. మధ్యాహ్నం 1.40 గంటలకు ఒకేసారి ఎక్కువ మొత్తంలో విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చారని, చిన్న గేటు ద్వారా చెక్ చేస్తూ పంపించామని చెప్పారు. కాగా, కిటికీల ద్వారా రాఖీలు కట్టిన తమ పిల్లలను పాఠశాలలో ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందని, కాబట్టి జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపి విద్యార్థినులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

40 ఏళ్లకు కలిసిన పేగుబంధం

- మతిస్థిమితం కోల్పోయి మహారాష్ట్రలోని మలాడ్ చేరిన పెద్ద కిష్టన్న
- గతం గుర్తుకు రావడంతో ఇంటికి చేరిన వైనం



తన కొడుకు బుచ్చన్నతో ఏర్నాగి పెద్ద కిష్టన్న

దేవరకద్ర రూరల్: భార్య అకాల మరణం, మానసిక సమస్యలతో ఐదేళ్ల లోపు ఉన్న తన ఇద్దరు పిల్లలను నానమ్మ దగ్గర వదిలేసి వెళ్లిన ఓ వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి ఊరూరు తిరిగాడు. కొన్ని రోజుల క్రితం పిల్లలు, పుట్టిన ఊరు గుర్తుకు రావడంతో దాదాపు 40 ఏళ్ల తర్వాత కొడుకు చెంతకు చేరిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం డోకూర్ గ్రామానికి చెందిన ఏర్నాగి పెద్ద కిష్టన్న(70), భార్య బాలమ్మ దంపతులకు మణెమ్మ, బుచ్చన్న సంతానం. పిల్లలకు ఐదేళ్ల వయసు ఉన్నప్పుడు బాలమ్మ అనారోగ్యంతో చనిపోయింది. దీంతో మానసికంగా కుంగిపోయిన కిష్టన్న తన ఇద్దరు పిల్లలను వారి నానమ్మ(కిష్టన్న తల్లి) దగ్గర వదిలేసి ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. మతిస్థిమితం కోల్పోయి వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ మహారాష్ట్రలోని మలాడ్ ప్రాంతానికి చేరుకున్నాడు. వివిధ పనులు చేస్తూ అక్కడే బతికాడు. ఇటీవల తన ఊరు, కుటుంబం గుర్తుకు రావడంతో అక్కడే జీవనం కొనసాగిస్తున్న మక్తల్ ప్రాంతానికి చెందిన తెలుగు వారికి వివరాలు తెలిపారు. వారి సహకారంతో మంగళవారం తన స్వగ్రామం డోకూర్‌కు వచ్చాడు. గ్రామస్తులకు వివరాలు చెప్పగా.. బీజేపీ నాయకుడు రాజుయాదవ్ ఫోన్‌లో హైదరాబాద్‌లో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న కొడుకు బుచ్చన్నకు సమాచారం అందించాడు. చనిపోయాడు అనుకున్న తండ్రి తిరిగి రావడంతో.. వెంటనే గ్రామానికి చేరుకొని తన తండ్రిని చూసి ఆనందం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో పెద్ద కిష్టన్న కూతురు గురించి ఆరా తీయగా.. కొన్ని ఏళ్ల క్రితమే ఆమె మరణించింది అని తెలుసుకొని తీవ్రంగా బాధపడ్డాడు. ఏ అండ లేకపోయినా ఆర్థికంగా ఎదిగిన తన కొడుకును చూసి మురిసిపోయాడు. గ్రామస్తులకు కృతజ్ఞతలు చెప్పి తన కొడుకుతో కలిసి హైదరాబాద్ వెళ్లిపోయాడు.

జలదిగ్బంధంలో జడ్చర్ల ఆస్పత్రి



వంద పడకల ఆస్పత్రి ప్రాంగణంలో చేరిన వరద నీరు

- లోతట్టు ప్రాంతంలో నిర్మించడంతో ముంచెత్తిన వరద
- ప్రహరీ కింద గండి
- ఆస్పత్రి ప్రాంగణంలోకి చేరిన నీరు
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న రోగులు
- పర్యవేక్షించిన అధికారులు



విచారిస్తున్న ఇరిగేషన్ ఈఈ, తహసీల్దార్, తదితరులు

జడ్చర్ల: జడ్చర్ల పరిధిలో 167వ నంబర్ జాతీయ రహదారిని అనుసరించి నిర్మించిన వంద పడకల ఆస్పత్రి భవనం వరద నీటిలో చిక్కుకుంది. మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరద నీరు ఆస్పత్రి ప్రాంగణంలోకి వచ్చి చేరింది. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొన్నారు. ఎగువ ప్రాంతం కావేరమ్మపేట నుంచి పెద్దఎత్తున వర్షం నీరు దిగువకు ప్రవహించడంతో లోతట్టు ప్రాంతంగా ఉన్న వంద పడకల ఆస్పత్రి భవనంలోకి చొచ్చుకొచ్చాయి. ఆస్పత్రి భవనం చుట్టూ నిర్మించిన ప్రహరీని భూమిలోతు నుంచి నాణ్యతగా నిర్మాణం చేయకపోవడంతో ప్రహరీ కింద గండి పడింది. ఈ కారణంగానే వరద నీరు ఒక్కసారిగా ఆస్పత్రి ప్రాంగణంలోకి చేరింది. వరద నీటితో పాటు డ్రెయినేజీ నీరు కలిసి పారడంతో ఆస్పత్రి ప్రాంగణం కలుషితంగా మారింది.

కలెక్టర్ ఆదేశాలతో..

స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వంద పడకల ఆస్పత్రి ప్రాంగణంలో వరద పరిస్థితిని కలెక్టర్ విజయేంద్ర బోయి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ క్షేత్ర స్థాయిలో విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో నీటి పారుదల శాఖ ఈఈ కృష్ణమోహన్, డీఈ కృష్ణ, జేఈ నరేష్‌తో పాటు స్థానిక తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆస్పత్రి ప్రాంగణంలోకి వరద నీరు చేరడంపై విచారించారు. ఆస్పత్రి ప్రహరీ నాణ్యత లేకపోవడంతో గండి పడి వరద నీరు లోపలికి చేరిందని అధికారులు తెలియజేశారు.

ఆస్పత్రికి ఎలా వెళ్లాలి..



ఆస్పత్రిలో వైద్యం కోసం వెళ్దామంటే వరద నీటిని దాటుకుంటూ వెళ్లాల్సి వస్తుంది. అసలే వైద్యం కోసం ఆస్పత్రికి వస్తున్నాం. ఇక్కడకు వచ్చి ఇలా వరద నీటిలో ఇబ్బందులు పడి మరింత అనారోగ్యానికి గురయ్యే దుస్థితి నెలకొంది. – అలివేలు, రాజాపూర్

చర్యలు చేపట్టాలి..



ఆస్పత్రికి వెళ్లేందుకు సరైన మార్గం ఏర్పాటు చేయాలి. వరదతో కూడిన మురుగు నీటిలో ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తుంది. ఆస్పత్రి ప్రాంగణంలోకి వరద నీరు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. సురక్షితంగా రాకపోకలు సాగేలా ఏర్పాట్లు చేయాలి.

– జరీనా, ఊర్కొండపేట

నాలా విస్తరణకు చర్యలు..



ఆస్పత్రిలోకి వరద నీరు చేరకుండా చర్యలు తీసుకుంటాం. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీటికి అనుగుణంగా నాలాను విస్తరించాల్సిన అవసరం ఉంది. ఇందుకు సంబంధిత నీటి పారుదల శాఖ అధికారులతో ప్రతిపాదనలు తయారు చేయించి చర్యలు చేపడుతాం.

– అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

లోతట్టులో నిర్మించడంతోనే..

వంద పడకల ఆస్పత్రి భవనాన్ని లోతట్టులో నాలా ప్రవహించే ప్రాంతంలో నిర్మించడంతోనే ఆస్పత్రి ప్రాంగణం ప్రతిసారి వరద నీటి సమస్య తలెత్తుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరుతో పాటు డ్రెయినేజీ నీరు ప్రవహిస్తుందని, ఇటువంటి ప్రాంతంలో ఆస్పత్రిని నిర్మించారని తెలియజేశారు. ఇక్కడ ఆస్పత్రిని రోడ్డుకు కొంత ఎత్తులో నిర్మించి ఉంటే సమస్య వచ్చేది కాదన్నారు.

సోషల్ మీడియాలో వైరల్..

జడ్చర్ల వంద పడకల ఆస్పత్రి ప్రాంగణంలో భారీగా చేరిన వరదనీటి దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కొందరైతే నేరుగా కలెక్టర్‌కు వాట్సప్‌లో షేర్ చేయడంతో ఆమె స్పందించి విచారణకు ఆదేశించారు. ఇక అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు స్థానిక వాట్సప్ గ్రూపుల్లో విమర్శలు చేసుకున్నారు.

నల్లకుంటను పరిశీలించిన అధికారులు

జడ్చర్ల: బాదేపల్లిలోని నల్లకుంటను మంగళవారం జిల్లా నీటిపారుదల శాఖ ఈఈ కృష్ణమోహన్, డీఈ కృష్ణ ఇతర అధికారులు పరిశీలించారు. నల్లకుంటకు చేరిన వరద నీరు నాలా నుంచి బయటకువచ్చి నేతాజీ చౌరస్తాకు వెళ్లే ప్రధాన రహదారిని ముంచెత్తడంతో పాటు సమీప కాలనీల్లోకి, దుకాణాల్లోకి చేరుతోంది. దీంతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో అధికారులు చర్యలు చేపట్టారు. బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాలు చేపడుతుండడంపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇప్పటికే వారికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. తదుపరి ఊరకుంటను పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు 33వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- జల విద్యుత్ కేంద్రంలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి
- నారాయణపూర్ ప్రాజెక్టుకు 40వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



దిగువ విద్యుదుత్పత్తి కేంద్రంలోని స్విచ్‌యార్డు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రం జూరాల ప్రాజెక్టుకు 48,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మంగళవారం సాయంత్రానికి 33 వేల క్యూసెక్కులకు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు దిగువన ఉన్న ఎగువ జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఐదు యూనిట్లలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 39,184 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 94 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 735 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 260 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 75 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 41,338 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.909 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో వరద పెరిగినట్లు అధికారులు చెప్పారు. ప్రాజెక్టుకు 40,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు వద్ద 16 గేట్లను 43,120 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 33.313 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 33.26 టీఎంసీల పూర్తిస్థాయిలో నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలియజేశారు.

వేగవంతంగా విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జూరాల జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. మంగళవారం 11 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలియజేశారు. ఎగువలో 5 యూనిట్లతో 195 మెగావాట్లు, 85.855 ఎంయూ, దిగువలో 6 యూనిట్లతో 240 మెగావాట్లు, 61.440 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 147.295 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి అయిందన్నారు. జూరాల ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో వరద నీరు చేరుతుండడంతో 11 యూనిట్లతో ఉత్పత్తి చేపడుతున్నామని, ప్రస్తుతం 39,184 క్యూసెక్కులను వినియోగించి దిగువ శ్రీశైలానికి నీటిని వదులుతున్నామని చెప్పారు.

శ్రీశైలంలో 881.8 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో మంగళవారం నీటిమట్టం 881.8 అడుగుల వద్ద 197.9120 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 36,366 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 53,748 మొత్తం 90,114 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వస్తున్నాయి. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,328 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 30,000 క్యూసెక్కులు, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,350 క్యూసెక్కులు మొత్తం 71,223 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.680 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు. స్థానికంగా 14.80 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రామన్‌పాడులో నిలకడగా..

మదనాపురం: మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం నిలకడగా కొనసాగుతుంది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 920 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మంగళవారం నాటికి పూర్తి నీటి మట్టం 1,021 అడుగులకు చేరింది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1,150 క్యూసెక్కులు, వివిధ లిఫ్టుల ద్వారా 858 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రసీల్‌రెడ్డి తెలియజేశారు.

సుంకేసులలో 12 గేట్ల ద్వారా నీటి విడుదల

రాజోళి: సుంకేసులలో మంగళవారం 12 గేట్ల ద్వారా నీటి విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 56,193 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా 53,748 క్యూసెక్కులను దిగువకు వదిలి, 2,445 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు వదిలినట్లు తెలియజేశారు.